# ముడుపు

విరగబడి నవ్వేడు చిదంబరం.

ఉన్నట్టుండి అలా వికటాట్టహాసం చేసినందుకు మిగతా ఇద్దరికీ మూర్ఛవచ్చినంత పనైంది. దించిన గ్లాసులు మరి పైకెత్తకుండా, ఎత్తిన కనురెప్పలు మరి వాల్చకుండా అలా చిదంబరం వైపు చూస్తో వుండి పోయేరు.

ఇదేవిటి? ఈ మానవుడు అప్పుడే గుర్రం ఎక్కేసేడా?

అబ్బే! వాళ్ళ అనుభవంలో ఇంతకు ముందు ఎన్నడూ అలా జరగలేదు. పెదవి ఆరకుండా తెల్లవార్లూ మందు పుచ్చుకున్నా మనిషి మాట జారడే?

ఏదో ఊహించని విపత్తు ముంచుకొచ్చినంతగా రాపడిపోయేరు వాళ్ళు.

బయట చీకటి చౌర్యవిహారం చేస్తోంది. లోపల గదిలోనూ అది గమ్మత్తుగా దోబూచులాడుతోంది.

గుండ్రటి టీపాయ్ చుట్టూ కూర్చొన్నారు. వాళ్ళ తల మీద షేడ్‌లోంచి ఎర్రటి విద్యుద్దీపం నెత్తుటి కాంతి చిమ్ముతోంది. పైగది గుమ్మంలోంచి చూస్తే వాళ్ల మీదికి ప్రసరిస్తోన్న ఎర్రటి కాంతి వర్తులం పెద్ద వ్రణంలా కన్పిస్తోంది. వాళ్లు ముగ్గురూ అందులో కదలాడుతోన్న క్రిముల్లా వున్నారు.

"ఎందుకలా చూస్తారు? కానివ్వండి?'' అన్నాడు చిదంబరం.

అతగాడంత సౌమ్యంగా మాట్లాడినా వీళ్ల అనుమానం తీరలేదు.

చిదంబరం గ్లాసు పైకెత్తి రెండు గుక్కలు మింగి చప్పరించేడు. చప్పరించి మళ్ళీ నవ్వేడు. ఇది వికటాట్టహాసం కాదు 'మందు'హాసం.

"ఈ దేవుళ్లనీ కోర్టుల్నీ ఎవడు సృష్టించేడో గాని నిజానికి మనం వాణ్ని పూజించాలి'' అన్నాడు చిదంబరం. అని చాల సేపయింది. అయినా అతని పెదాల మీంచి హాసం ఇంకా జారిపోలేదు.

-ఇదా బాబూ తమ వికటాట్టహాసానికి కారణం, అనుకున్నాడు జస్టిస్ రామస్వామి.

రామస్వామి గొప్ప రామభక్తుడు. నిజం చెప్పాలంటే ఆ రాముడి తాలూకు ఏ అవతారానికైనా అతడు విధేయుడే. రాముడి పేరుతో ముద్దాయి కన్పించినా భక్తి ప్రపత్తులతో వినమ్రుడై పోతాడు. అతడు జడ్జీ అయినా కూడా వేకువనే లేచి వాకింగు ముగించుకొని స్నానం చేసి, శ్రీరామ విగ్రహం ముందు అరగంటసేపు ఆంజనేయుడిలా కుప్పిగంతులు వేసి భజన చేస్తే తప్ప అతనికి సంతృప్తి వుండదు.

రామస్వామి కేవలం రామభక్తుడే కాదు. ఆ తారకరాముడి తాలూకు సర్వసద్గుణాలనీ సంతరించుకున్న పురుషోత్తముడిగా ఆయన బంధుకోటిలో ప్రసిద్ధుడు.

ఆ రాముడి దొక్కటే బాణం.

ఈ రాముడి దొక్కటే తీర్పు

ఒక్క జానకి దగ్గరే ఆ రాముడితో ఈ రాముడు సామ్యం భేదించింది. ఆ జానకి రాముడి ఆజ్ఞతో అగ్నిలోకి దూకిన సాధ్వి. ఈ జానకి మన అభినవ రాముడి ఓర్పుకే అగ్నిపరీక్ష.

"జానకీ, నీకింతటి సౌమ్యమైన పేరు ఎవరు పెట్టేరోగాని..." అంటూ వుంటాడు అప్పుడప్పుడూ భార్య నుద్దేశించి, అలాంటప్పుడామె తాళ ప్రమాణంలో లేచి తాటకిలా విజృంభిస్తుంది.

"అంటే ఏవిటి మీ వుద్దేశం. గయ్యాళి గంపననేగా! ఈ గయ్యాళిగంపే లేకపోతే మీరెక్కడ వుండేవారో! నేను గదా మీకు చదువు చెప్పించి మనిషిని చేసింది? నేను గదా మీకు ప్రాక్టీసు లేకపోతే పదేళ్ళు పోషించింది? నేను గదా మీకు గవర్నమెంటు ప్లీడరీ ఇప్పించింది? నా మూలంగా కాదా మీకీ జడ్జి పదవి వచ్చింది? నా వల్ల.." అంటూ ఓ దండకం మొదలెడుతుంది.

ఆమె మూలంగా అన్ని ఘనకార్యాలు ఎలా జరిగేయనేది అప్రస్తుతం. అసలు ఆయనే వాటి గురించి ఆలోచించనప్పుడు మనకెందుకు? అయితే అదంతా ఆమె చలవేనని మాత్రం ఇప్పటికీ అతని విశ్వాసం.

రెండు సార్లు బి.ఎ తప్పితే మరింక పనికిరాడనే నమ్మకంతో పెళ్ళి చేసేసేడు వాళ్ళ నాన్న. అదీపాసయ్యేడని మభ్య పెట్టి పాతిక వేలు కట్నం గుంజి మరీ పెళ్ళి చేసేడు. మరింక అతని భారం లేకుండా ఇల్లరికం ఏర్పాటు కూడా చేసేడు వాళ్ళ నాన్న. పెళ్ళయిన సంవత్సరమే బియ్యే పాసవటమూ ఆ తర్వాత లా చదువూ, వృత్తీ, వృత్తిలో ఒక్కొక్క మెట్టే ఆరోహణం... ఆమె పాణిగ్రహణ వేళావిశేషంగాక మరేమిటి?

అందుకే ఆమె సీతాదేవి కాకపోయినా అతను మాత్రం ఆమె పట్ల అచ్చమైన శ్రీరామచంద్రుడిగానే మసులుకుంటాడు. అందుకు ఒక దృష్టాంతంగా కట్టుకున్న మూడంతస్తుల సుందర భవంతికి "జానకీ నిలయం" అని నామకరణం చేసేడు. అంతేకాదు –

"పరస్త్రీని కన్నెత్తి చూడడు."

"మద్యం ముట్టడు."

"కాఫీ టీలు తాగడు."

"ఆ మాట కొస్తే భార్య చేతిమీదుగా గాని మంచినీళ్ళయినా ముట్టడు" అనే సత్కీర్తిని సాటివారిలో స్థిరపర్చుకున్నాడు.

గ్లాసు పైకెత్తి సగం గొంతులో పోసుకున్నాడు రామభక్తుడు.

- ఎంత మినిష్టరైతే మాత్రం అంత పొగరా? దైవదర్శనానికొచ్చి దేవుణ్నే పరిహసిస్తాడా? ఒక హైకోర్టు జడ్జీ ముందు కోర్టుల్నే గేలి చేస్తాడా?

ఆపుకోలేనంత కోపం వచ్చింది రామస్వామికి. కాని ఏం చేసుకోను ఆకోపాన్ని? కోప కారణమైన అవతలి వ్యక్తి సాధారణ మానవుడు కాకపోయే. మంత్రి, కాబోయే ముఖ్యమంత్రి. ఆ శ్రీరామచంద్రుడు దయ తలిస్తే, కాలం కల్సివస్తే. జానకి వచ్చిన వేళావిశేషం మారకుండా వుంటే - అతగాడు ముఖ్యమంత్రి కాకపోతాడా? తను హైకోర్టు ప్రధానన్యాయమూర్తో లేక సుప్రీం కోర్టు న్యాయాధిపతో కాకుండా వుంటాడా?

అందుకే మాట్లాడలేదు. నోరువిప్పి అతని అఘాయిత్యాన్ని ఆపలేదు.

"మీ వృత్తినీ, మీరు నమ్ముకున్న దేవుళ్ళనీ గేలిచేస్తున్నానని కోప్పడుతున్నారా జడ్జీగారూ....."

"అబ్బే..... నేనేం కోప్పడ్డం లేదండీ."

"పోనీ బాధ పడుతున్నారు. అవునా? అయినా నేనన్నది ఏమున్నది? దేవుళ్ళ గొప్పతనాన్నీ, కోర్టుల న్యాయ విధుల్నీ వేనోళ్ళ పొగుడుతున్నాను. అంతే....."

ఆ మాటలు విన్నాక తను హఠాత్తుగా నాస్తికుడై పోయినంత కోపం వచ్చింది దేవుడమ్మకి. అలా కోపం రావటానికీ దేవుడమ్మ ఏకోర్టులోనూ జడ్జీకాడు. కనీసం ప్లీడరైనా కాడు. ఏ దేవాలయంలోనూ అర్చకుడు కాడుకూడాను. కాని, ఈ రెండిటినీ నమ్ముకుని అభివృద్ధిలోకి వస్తున్న "ఏ క్లాసు" కాంట్రాక్టరు. అతని పేరు దేవుడమ్మ. వాళ్లమ్మకి లేక లేక కలిగి, దేవుడి మీద ఎనలేని విశ్వాసం కలిగించి, దేవుడమ్మయ్యేడు. దేవుడమ్మ పరాయివాళ్ళ పాలౌతుందనుకున్న ఆస్థికి వారసుడయ్యేడు. దాన్ని పెంచి

పోషించే నాథుడయ్యేడు. స్థానిక దేవుళ్ళకి కొంత మందికి ధర్మకర్తయ్యేడు. ప్లీడర్లకీ, జడ్జీలకీ, పిడబ్ల్యూడీ గుమాస్తాలకీ రాజపోషకుడయ్యేడు. అధికార పార్టీ ఎన్నికల నిధులకి నిధయ్యేడు. తన ఆస్థినీ, ఆధిక్యతనీ కంటికి పాపలా కాపాడుతోన్న ఈ వ్యవస్థనీ, దాని కొమ్ముకాస్తోన్న కోర్టుల్నీ దేవుళ్ళనీ ఎవరైనా ఏమన్నా అంటే చచ్చేంత కోపం వస్తుంది దేవుడమ్మకి. తగని కసి పుడుతుంది. ఎంత కసి పుడుతుందంటే, అలా దూషించిన వాణ్ని కోర్టులకీ, వాటి సాక్షులకీ అందనంత దూరం పంపించేయాలన్నంత కోపం వస్తుంది. కాని, కాని... ఆ వ్యక్తి సామాన్యుడు కాకపోయేడు. అందుకే అది చచ్చేకోపమేగాని కసికోపం కాలేకపోయింది.

"ఇంతకీ మీరిక్కడికి ఎందుకొచ్చినట్టుచిదంబరంగారూ" అనడిగేడు దేవుడమ్మ. దేవుడి గెస్టు హవుస్‌లో కూర్చుని ఆ మాట అడిగినందుకే సగం పాపం చేసినట్టుగా విలవిల్లాడిపోయేడు. అది భరించలేక గ్లాసు చేతిలోకి తీసుకుని గటగటా రెండు గుక్కల్లో ఖాళీ చేసేసి టీపాయ్ మీద పెట్టేసేడు. అసలు పాపమంటే ఏమిటో ఎరగని చిదంబరం మరో సీసా మూత విప్పి ఆ ఖాళీ గ్లాసు నింపేడు.

చిదంబరం అంటే చిన్ననాటి స్నేహితుడు మాత్రమే కాడు దేవుడమ్మకి. ఆత్మీయుడు, ఆరాధ్యుడు, ఎమ్మెల్యే రోజుల్నుంచీ తన వృత్తిలో, అన్ని లావాదేవీల్లో ఎదురయ్యే అవరోధాలన్నిటినీ "చక్రం" అడ్డేసి నిరోధిస్తూ వస్తున్న ఆప్తుడు. అవసరమైతే సలహాలిచ్చి నడిపించే ఆంతరంగికుడు. ఆ ఆత్మీయత ఇలాంటి సుందర సన్నివేశాల ద్వారా మరింత పెరిగి, మూడు సీసాలూ,ఆరు గ్లాసులుగా వర్థిల్లుతోంది. అయినా అతని హద్దులేవిటో అతనికి తెల్సు. మంత్రి గానే గాని, మిత్రుడుగా అతని ముందు ప్రవర్తించడు.

"ఎందుకొచ్చేమో మనందరికీ తెల్సురా దేవుడూ. అందుకే కోర్టుల్నీ,దేవుళ్ళనీ సృష్టించిన ఆ మహామేధావి మనకి ఎంత మేల్జేసేడో రెండు సీసాలు ఖాళీ చేసినా మర్చిపోలేకుండా వున్నాను."

"ఎలాగంటావేమో? చెప్తా విను. నువు వెంకునాయుణ్ని పబ్లిగ్గా రోడ్డు మీద హత్య చేయించేవు. ఏమయింది? కింది కోర్టులో నీకు అనుకూలంగా సాక్ష్యాలు పలికించినా నెగ్గలేక పోయేవు. పై కోర్టు కెళ్ళేవు. అక్కడ జడ్జీగారికి, అక్షరాలా వీరికే; యాభై వేలుచదివించుకుని కేసు కొట్టేయించేవు. అయినా పాపభీతి మాసిపోలేదు. పాపాల్ని దేవుడే తుడిచి పారెయ్యాలిగాని, కోర్టులు కొట్టిపారెయ్యలేవుగా. అందుకే లక్ష రూపాయలు హుండీలో పారేసి హాయిగా మందు కొట్టేస్తున్నావు. నువు కట్టిన

బ్రిడ్జీకూలిపోతే, అందుకు ప్రభుత్వంవారు ఒక పరిశీలనా సంఘాన్ని నియమిస్తే,అది నీకు అనుకూలంగా రాసినందుకు నాకో లక్ష పారేశావు. అందులో ఓ పాతిక దేవుడి మొహాన్న పారేసి నేనూ నీతోబాటు మందు దట్టించేస్తున్నాను. ఇంత సుఖమైన ,సుళువైన ఏర్పాటు మరెక్కడుంది చెప్పు.'' అని అలా తన వికటాట్టహాసం యొక్క ఆంతర్యాన్ని విపులీకరిస్తూ వుంటే, అనవసరంగా తనను కూడా ఇరికించినందుకు అక్కడి రామభక్తుడికి ఆపుకోలేనంత కోపం వచ్చేసింది.

"నా పైని మీరు అన్యాయంగా నేరాల్ని ఆపాదిస్తున్నారు. నా గురించి మీకేం తెలీదు'' అన్నాడు.

"అలాగా... అయితే మీ గురించి మీకే తెలియదని అనిపిస్తోంది. మిమ్మల్ని గవర్నమెంటు ప్లీడరుగా నియమించినందుకూ, ఆ తర్వాత జడ్జి పదవి ఇప్పించినందుకూ, మీ మామ గారు నాకెంత సమర్పించుకున్నారో మీరెరుగుదురా? ఖచ్చితంగా ఎరుగుదురు. ఎంచేతనంటే ఖర్చు చేసిన డబ్బు మీరు రాబట్టలేకపోతున్నారని మీ ఆవిడ మాటిమాటికీ ముల్లు కర్రతో పొడుస్తూ వుంటేనే గాళ్ళోపడ్డారన్నది మీకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుంది?''

"అంతేకాదు. మీరు తాగుతారనీ, ఇప్పుడిప్పుడే పైగదిలోంచి స్నానం చేసి దిగి వచ్చేరనీ ఎవరికైనా తెల్సా? కనీసం మీ ఆవిడకి,కింద కాటేజీలో ఆదమరచి నిద్రపోతోన్న ఆ సీతమ్మ తల్లికి. ఊహు... తెలీదు. మీరు ఆమెచెవిలో గీపెట్టి చెప్పినా ఇక్కడ ఇంతటి పుణ్య కార్యాలు జరుగుతున్నాయని ఆమె చచ్చినా నమ్మదు. ఇది పుణ్యక్షేత్రం'' అని లెక్చరు ముగించేడు చిదంబరం.

ఎవ్వరూ మాట్లాడలేదు కాని, మెట్ల మీద నించి మాత్రం కేక విన్పించింది.

"సర్. తెల్లవారవస్తోంది. నాకింక సెలవిప్పించండి'' అంది ఓ చిన్నది.

"చూడు దేవుడూ దాన్ని పంపించెయ్''

దేవుడమ్మ పైకెళ్ళి వాళ్ళసుఖాలకి సుంకం చెల్లించి వచ్చేడు.

"థేంక్స్ సర్... మీ మేలు మర్చిపోలేను'' అందామె.

"మంచిది వెళ్ళిరా''

"నా బేగ్ సర్...''

"ఎక్కడ?''

"ఆ టీపాయ్ కింద'' అని ముందుకు వచ్చి వంగి బేగ్ తీసుకుని, వయ్యారంగా వెళ్ళిపోయింది.

"దీనిమట్టుకిది పెద్ద పతివ్రతలా లెక్చరిచ్చింది. అది అలాంటిది కాదుట. అవసరం వచ్చింది కాబట్టి గాని లేకపోతే ఆ పాపపు పని చేసేది కాదుట."

"ఏవిటో ఆ అవసరం?" అడిగేడు దేవుడమ్మ.

"నీకు చెప్పలేదా? అయితే రామస్వామికి చెప్పి వుంటుంది."

"ఉహూ... నాకూ చెప్పలేదు."

"అయితే నీకూ చెప్పలేదన్న మాట. సరే. అయితే చెబుతా వినండి. దాని మొగుడు చావు బతుకుల్లో వున్నాడట. చచ్చేముందు ఒకసారి తిరుపతి దేవుణ్ణి చూడాలని కోరేడుట. ఎలాగో నానా తంటాలూ పడి తీసుకొచ్చిందిట. మరి తిరిగెళ్లటానికి డబ్బు లేక తనువు తాకట్టుపెట్టాల్సి వచ్చిందిట?"

మళ్ళీ పకపకా నవ్వేడు. కాస్సేపలా నవ్వి గుక్క తిప్పుకుని.

"ఇక్కడ దేవుడి నీడలో జరగని పాపం అంటూ లేదు. దానికి నిజంగా మొగుడున్నాడనుకుంటున్నారా? ఉహూ... మొగుడూ లేడు ముచ్చూ లేదు. అదో ట్రిక్కు, ట్రేడ్ ట్రిక్కు" అని కూర్చుని –

"దేవుడూ... ఉక్కబోస్తోంది కాస్త ఫేనుజోరు పెంచు" అని గ్లాసు టేబుల్ మీద పెట్టి సీసా తీసేడు. దాని కింద నుంచి ఒక కాగితం ముక్క ఎగిరెళ్ళి రామస్వామి ముందు ఆగింది.

రామస్వామి కాగితం చదువుకుని లేచి చిందులేసేడు. అతని చేతిలోంచి దేవుడమ్మ దాన్ని లాక్కుని చదివేడు. తర్వాత దిగాలుగా చిదంబరం చేతిలో పెట్టేడు.

"టీపాయ్ కింద నా సంచిలో టేప్ రికార్డరుంది. అందులో రికార్డయిన మీ సంభాషణ తిరిగి తీసుకోవాలంటే పది వేలతో పాపనాశనం దగ్గరికి తెల్లవారకముందే రండి."

అందరూ మౌనంగా కూర్చుండిపోయేరు. అయిదు నిమిషాల తర్వాత –

"చిదంబరంగారూ మీరే రక్షించాలి. పది వేలూ నేనే ఇచ్చుకుంటాను" అన్నాడు మలేరియా పేషెంటులా ఒణికిపోతూ జస్టిస్ రామస్వామి.

●

*(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక 1983)*